

కథా కౌముది

# నిధి చాలా సుఖమా!

వి.ఎస్.ఎస్.హేమ

చిన్న ఊరు మాది.

ఊరిపేరు గోపాలపురం.

మా ఊరి జమిందారులం మేమే.

రాజులు పోయారు.

రాజ్యాలూ పోయాయి.

జమిందార్లూ తగ్గిపోతున్నారు. జమీలు తరిగిపోతున్నాయి. కరిగి పోతున్నాయి. మాదీనూ,

నేను మాత్రం పూర్వపు వైభవాన్ని వదులుకోవటానికి ఇష్టపడటంలేదు. ఎందుకు వదలాలి?

కనీసం మా జమిందారీ వంశపు ఆచారాల్ని.. సాంప్రదాయాలనూ పాటించాలని నా అభిమతం నేను బ్రతికి ఉన్నంతవరకూ అయినా పాటించాలి ఆ తర్వాత ఏముందని?

●●●

రేపే ఉగాది.

నెలరోజుల ముందు నుండే మా మేడ లోగిలిని శుభ్రం చేయటం, సున్నాలు వేయటం మొదలు పెట్టారు.

పనివాళ్ళు సింహపు ద్వారపు గుమ్మానికి అరటి చెట్లూ.. ద్వారాలకు తోరణాలూ కట్టసాగారు.

"రావమ్మా మహాలక్ష్మీ రావమ్మా" - అంటూ స్వాగతిస్తోంది వాతావరణం.

"అమ్మా! మహలక్ష్మీ తల్లీ, తమరి కోసం కరణం బాబుగారి తాలూకూ మనిషొచ్చాడండీ" - గుమస్తాగారు వచ్చి చెప్పారు.

"కరణం గారింటికి పంపే సామానంతా పంపించలేదా సుబ్బయ్యగారూ?"

"మొన్ననే పంపించానమ్మా"

"మరెందుకూ" - అనుకుంటూ

"ఇక్కడకి పంపండి" - అన్నాను.

మా మండువా చావిట్లో పెద్ద ఉయ్యాలబల్లపై కూర్చున్నాను.

మండువా చావిళ్ళ నిండా అరటి గెలలూ, అరటి పూవులూ, తియ్యగుమ్మడికాయలు, వంకాయలూ, బెండకాయలూ, పొట్లకాయలూ, గోంగూరా, బచ్చలీ... అంతా మా ఇంటి పంటే.

నా ఆదేశానుసారం ఎవరెవరింటికి ఏమేమి పంపాలో అవన్నీ కొత్త తాటాకు బుట్టల్లో నింపుతున్నారు మా పనివాళ్ళు.

"మునసబుగారి చిన్నింటికి పంపే బుట్ట ఏదీ యాదీ?"

"చిన్నింటికి పెద్ద బుట్ట ఎందుకమ్మా - ఇదిగో ఈ చిన్న బుట్టలో అన్ని సర్దించేసాను" నవ్వుతూ ఆ బుట్టను చూపించింది మా యాది. దాని పూర్తి పేరు యాదమ్మ.

పనివాళ్ళను పూర్తిపేరుతో పిలవటం మాకలవాటు లేదు. అయితే వాళ్ళకేలోటూ లేకుండా చూడ్డం మా బాధ్యతగా మేమభిప్రాయపడతాం. పోయిన నెలలోనే దాని పెళ్ళి జరిపించాను. అది కోరుకున్న వాడితో మా గుళ్ళోనే నా సమక్షంలోనే అదో ఇంటిదయింది. వాడూ మాదగ్గరే పనిచేస్తున్నాడు.

యాదికి పసుపూ, కుంకుమల కింద అర్థెకరం పొలం, కాసున్నర బంగారంతో పుస్తెలూ, నల్లపూసలూ చేయించి ఇచ్చాను. ఇదీ మా ఆచారమే.

అయితే ఈ ఆచారం నాతో ఆగిపోతుంది.

దేనికైనా ప్రాప్తం ఉండాలిగా!

గోదావరికి ఎంత పాత్రతో వెళితే అన్నే నీళ్ళు దక్కుతాయి అంటారు. బహుశా నేను పూర్వ జన్మలో ఏ పాత్రా తీసుకు వెళ్ళకుండా, వట్టిగా వ్యాహ్యాళికన్నట్లుగా వెళ్ళి ఉంటాను.

*అందుకే అనుకుంటాను 'అనుభవం' తెలీని ఆత్మ సంతృప్తి నాకు ప్రాప్తించింది.*

●●●

"అమ్మా! దండాలండీ" - కరణంగారి తాలూకూ మనిషి.

వినయంగా వంగి నమస్కారం చేసి, చేతులు కట్టుకుని కాస్త వంగి నిలబడ్డాడు.

"ఏమయ్యా ఏంటి పని?"

"ఆయ్.. కరణంగారి తల్లిగారు పంపారమ్మా. మొన్నారి పెద్ద మనవరాలిగారికి పెళ్ళయింది కదండీ? వియ్యాలోరి తాలూకా జనాలింకా ఇంట్లోనే ఉన్నారండి. అందుకనమ్మగారు... రేపు రెండు గేదెల పాలెక్కువ పంపిస్తారేమో అడగమన్నారండీ"

"అంతేకదా.. దీనికోసం కబురు పంపాలా! నేను అనుకున్నానులే ఎక్కువ పాలు పంపించాలని. అలాగే రెండు అరటి గెలలూ, అరటుపూలూ, రెండెక్కువ తియ్యగుమ్మడి కాయలూ, అరటాకుల కట్టలూ పంపిస్తాను. దేనికీ ఇబ్బంది పడక్కర్లేదని చెప్పానని చెప్పు."

"చిత్తమండి తమరి దయ. వత్తానమ్మా." - అతను రెండుచేతులూ ఎత్తి వినయంగా దణ్ణం పెట్టాడు.

"ఉండుండు. మరి నీ ఇంట్లోనూ పండగేగా. ఎలా చేసుకుంటున్నావయ్యా?" - అని,

"యాదీ ఆ బుట్టలో కాసిని కూరలు, అరటి హస్తం పెట్టి, ఒక బెల్లం ముద్ద ఇచ్చి పంపించు." - అన్నాను.

"ఆయ్. మీరు. అంటారని తెలుసు కదండీ. అందుకే ఆరిని చూసినప్పుడే బుట్ట సర్దేశానండీ. ఉండండి బెల్లం ముద్ద తెస్తాను." - అంటూ లోపలికి పరుగెట్టింది. ఇంత పిల్లప్పటి నుండీ నా ఇంట్లోనే పెరిగింది. నా దగ్గర చనువెక్కువ దానికి.

"తమరు పుణ్యాత్ములమ్మా తమరి దయవుండగా మాకు లోటేమిటి తల్లీ. తమరు మహాలక్ష్మి తల్లే కాదమ్మా. ఈ ఊరి అన్నపూర్ణవు తల్లీ. మనూరి గుళ్ళో గోపాలస్వామి కంటే ముందు, మనూరి జనాల సాధక బాధలు చూసేదీ, తీర్చేదీ తమరే కదమ్మా చల్లగా నిండు నూరేళ్ళూ వర్ధిల్లు తల్లీ." అతని మాటలూ దీవెనలూ వింటుంటే నవ్వొచ్చింది.

నిజమే. ఈ ఊరి జమిందారిణిగా నా పల్లె ప్రజల కష్టసుఖాలు నేను తీరుస్తున్నాను. మరి నాకు? నన్ను చూసేదెవరు? ఈ ప్రజలా? లేక మా కులదైవం వేణుగోపాలస్వామినా? ఎలా? నాకు ఇంత సంపదిచ్చా?

మణిమయ సిరులూ, గుడితాలూకూ మాన్యాలూ స్వామికీ ఉన్నాయి. కానీ అనుభవించేదెవరు? శిలారూపపు స్వామియేనా నిజంగా? కాదు.

మా సంపదలను అనుభవించేది మేముకాదు.

"యాదీ.. పూజారిగారింటికి ఆవునెయ్యి బింది పంపావా?"

"ఆయ్.. పొద్దున్నే పంపేశాను కదండీ. రాత్రికి బంతి కనకాంబరపు దండలూ, తులసి మాలలూ ఎక్కువ కావాలంటే - మన ఈరీ, నారిగాడు మద్దానెమె ఎల్లి ఇచ్చేసొచ్చారండి" - అది మాట్లాడుతూనే ఉంది. దాని కళ్ళు మాత్రం ద్వారాలను దాటుకుని వీధిలోకి పరుగెడుతున్నాయి. అది గమనించి "అప్పుడే నారిగాడి కోసం ఎదురు చూట్టం మొదలెట్టేవే! ఇప్పుడింకా మూడేకదా అయింది" అన్నాను.

"మూడేంటమ్మా? నాలుగోగంట కావత్తోంది. తొందరగా మందను తోలుకొచ్చి, పశువుల సావిట్లో కట్టేస్తే వీధి ఊడ్చేస్తారు, ఇంకా కల్లాపు చల్లి ముగ్గులెట్టాలి కదమ్మా. దీపాలేళ అయ్యేసరికి? అసలే పండగ రోజులు కదమ్మా? కాస్త పెందరాళే పెట్టేద్దామని." - అంది సమర్థింపుగా. దాని శ్రద్ధంతా ఒక్క ముగ్గులమీదే కాదు అని నాకు తెలుసు. కొత్తగా పెళ్ళయిన జంట. మనసు కువకువలాడటం సహజమే అనుకుంటా.

మా ఊరి చివరన ఎత్తైన కొండలు ఉన్నాయి. ఊర్లోని పశువులన్నింటిని ఆ కొండపైకే తోలుకెళ్తారు మేతకు. మా ఊరి పాలెగాళ్ళు అయితే పండగ రోజుల్లో మాత్రం గోధూళి వేలకు ముందే పశువులను ఇళ్ళకు తోలుకొచ్చేస్తారు. గోడకున్న పెద్ద చెక్క గడియారం వైపు చూసాను. నిజమే నాలుగు కావొస్తోంది.

ఎత్తురంగుల మేడలోగిళ్ళు మావి. అదీ కాక మా వీధి వీధంతా మా ఒక్క లోగిలే పెద్ద భవనంలా.

తుడిచి ముగ్గులు వేయటానికి చాలా సమయం పడుతుంది.

"వీడేంటీ ఇంకా రాలేదేంటీ?" - అనుకుంటూ నేను వీధి అరుగు మీదకి వచ్చాను. దూరంగా వీధి మొదట్లో మా పశువుల మంద. నల్ల సముద్రం కదిలి వస్తున్నట్లుగా ఉంది. మంద మధ్యలో గౌడు గేద మీద గోపాల కృష్ణమూర్తిలా కూర్చుని, మురళి వాయిస్తున్నట్లు ఫోజు కొడుతూ నారిగాడు.

నన్ను చూసి గభాల్న గేదమీద నుండి దిగి పరిగెట్టుకుంటూ నా దగ్గరకి వచ్చాడు.

"దండాలమ్మగారూ"

"ఆలస్యమయిందేంటిరా నారీ?"

"ఆయ్.. రావి చెట్టు వీధిలో పెద్దబ్బాయిగారు లేరాండీ. ఆరి ఎర్రావు ఆళ్ళ మందలోంచొచ్చేసి, మనావుబోతు ఎంట పడిందండి. దాన్ని అదిలించి ఆళ్ళింటికాడ వదిలొచ్చేసరికి ఆలీసమైపోయిందండి."

"సరి, సరి తొందరగా మందని చావిట్లో కట్టెయ్ దీపాలవేళ అవుతోంది" - అన్నాను. అంటూ యాది కోసం పక్కకి చూశాను. నా ప్రక్కన లేదు. అరుగు ఎప్పుడు దిగేసిందో ఏమో - దీపాల గూళ్ళను శుభ్రం చేస్తోంది. మొగుణ్ణి మురిపెంగా చూసుకుంటూ. దాని కళ్ళనిండా వెలుతుర్లే. మా వీధరుగులు మా సంపదకు చిహ్నంగా చాలా ఎత్తుగా ఉంటాయి. కానయితే మా ఊర్లో ప్రతీ ఇంటికీ చిన్న ఎత్తులోనైనా అరుగులు ఉంటాయి. ఆ అరుగుల తాలూకూ మెట్ల ప్రక్కగా దీపాలు పెట్టుకోవటానికి వీలుగా గోడలో కాస్త లోపలకు గూళ్ళలా కట్టివుంటాయి. కరెంటు లేని రోజుల నాటి పద్ధతి అయివుంటుంది. సాయంత్రమయితే గడపలకు పూజ చేసి, (పూజ అంటే ఏమీ లేదు, పాత్రనిండా నీళ్ళు నింపుకుని వాటిలో చిటికెడు పసుపు కలిపి, ప్రతీ గడప మీద కొద్ది కొద్ది చుక్కలు జల్లుతారు) ఆ తర్వాత ఆ నీటిని పెరట్లో తులసి కోటలో తులసి మొక్కకు పోస్తారు. ఆ తర్వాత దేవుని గదిలో దీపం వెలిగించిన తర్వాత రెండు ప్రమిదల్లో వత్తులూ, నూనె వేసి, తులసి కోట గూటిలో ఒకటీ, వీధరుగుల గూళ్ళలో రెండు వెలిగించిన ప్రమిదలు పెడతారు. మెట్ల

ప్రక్కన పురుగూ పుట్రా ఉన్నా నడిచేటప్పుడు, పాదరక్షలు విడిచినప్పుడు, వేసుకునేటప్పుడు, ఆ వెలుతురులో చూసి జాగ్రత్త పడతారనే ఆలోచన కూడా మరో కారణం.

అయితే నా గుండెలో గూడు కట్టటం వేణుగోపాల స్వామి మర్చిపోయి ఉంటారు. నా గుండె గుడిలో దీపం పెట్టటానికి ఆయనకు మనస్కరించినట్లుంది. బహుశా పూర్వజన్మలో చేసిన పాపం కావచ్చు. అనుభవించాలిగా. "అమ్మా ఏళవుతోంది. పెద్దబాబుగారికి కూరలేం వండమంటారు?" వంటామె ప్రశ్నకు జవాబు చెప్పాను ఆమె నా ఎదుట ఉన్నంత వరకూ నాలో అణిగిన నిట్టూర్పు. ఆమె కనుమరుగవగానే బయటపడింది. పండగరోజు కూడా ఇంటికి రాని నా తండ్రి. తను చేసిన తప్పుకు తానే శిక్ష విధించుకున్నట్లుగా ఇరవై సంవత్సరాల క్రితం ఇంత పెద్ద మేడను ఇంతింత ఆస్థినీ నాకు వదిలి, తను సన్యాసియై ఊరవతల, మా పొలాల చివర ఉన్న మా తోటలో ఆశ్రమం నిర్మించుకుని, అక్కడే ఉంటున్నారు. సపర్యలు చేయటానికి ఆయన దగ్గర పనివాళ్ళున్నా భోజనం మాత్రం ఇంటినుండే పంపిస్తాను. అమ్మలేదు. అమ్మ స్వర్గస్తురాలయిన సంవత్సరం తర్వాత నాన్న - "ఇలా మోడులా పడివున్న నిన్ను చూస్తూ నేను మనలేనమ్మా. నన్ను క్షమించు" - అంటూ వెళ్ళిపోయారు. నేనెంత బ్రతిమాలినా వినకుండా.

అసలు నాకేమైందని? నాన్న ఆలోచనలో తప్పుకూడా లేదు. రోజులు మారిపోతున్నాయి. ఆస్థులన్నీ ప్రభుత్వం చట్టాల పేరున స్వంతం చేసుకుంటుంటే, చదువు వచ్చి ఉండటం చాలా అవసరమని గ్రహించారు నాన్న. మా బంధువులలో తెలివైన అందమైన కుర్రాడిని వెదికి పట్టుకున్నారు. డబ్బులేకపోవటం ఒక్కటే అతనికున్న లోపం అనుకున్నారు అప్పట్లో. మా డబ్బుతో అతన్ని డాక్టర్ వరకూ చదివించి, పై చదువులకు విదేశాలకు పంపించారు. విదేశాలకి వెళ్ళేముందు మా పెళ్ళి జరిగింది. అతని చదువు ముగిసేవరకూ మాకు ఉత్తరాలు రాసాడు. ఆ తర్వాత తను ఇండియా తిరిగి రావటం లేదని, నన్ను తీసుకు వెళ్ళలేనని కూడా ఖచ్చితంగా రాసి, తన కోసం మేం పెట్టిన డబ్బు ఎంతో రాస్తే పంపించేస్తానన్నాడు. అమ్మ ఆ దిగులుతోనే చచ్చిపోయింది. నాన్న సన్యాసి అయ్యారు. నాకతని ఉత్తరం చదివినప్పుడు అతను అవివేకుడని అర్థమయింది.

సముద్రానికి నీళ్ళూ, మాకు డబ్బూ ఎదురివ్వటమేమిటి? తక్కువ ఆలోచన కాకుంటే! ఈ సంఘటన తాలూకూ వేదన మా కుటుంబమొక్కటే కాదు, మా ఊరు ఊరంతా పంచుకుంది. "బంగారం లాంటి మహాలక్ష్మి తల్లికి ఇలాంటి రాతరాయటానికి, ఆ వేణుగోపాలుని మనసెట్లా ఒప్పిందో అంటూ" - దేవుణ్ణి నిందించారు.

మా బంధువులు మాత్రం సంతోషించారు. ఇక ఆస్థికంతా తామే వారసులమని. నాన్న ఇల్లు విడిచి వెళ్ళిపోయాక ఊరువారు నాకు మరింత దగ్గరయ్యారు. తమ ఇంటిలో, సొంత కూతురు ఒంటరిదైనట్లు బాధపడిపోయారు. పనివాళ్ళు మరీ దగ్గరయ్యారు. మా గుమస్తాగారి కుటుంబం అమ్మా - నాన్నలయ్యారు. గుళ్ళో పూజారి రోజూ ఏదో ఒకవేళలో వచ్చి పురాణ కాలక్షేపం చేస్తారు. రాత్రివేళ నేను పడుకున్నప్పుడు యాది నాకాళ్ళు వత్తుతూ ఊర్లో ఆ రోజు విశేషాలు తను సేకరించినవన్నీ - హాస్యాన్ని జోడించి కథల్లా చెప్పి నా మనసుకు హాయినిస్తుంది.

యాది తల్లి  ఆది నా గుమ్మం ముందే దాని పడక. లాంతరు వెలిగించి వత్తి పెద్దది చేసి, తులసి కోట దగ్గర పెట్టి - "అమ్మా పూజారిగారు వచ్చారు" అన్నారు వంటావిడ. ఆవిడా నా దగ్గరే ఉంటుంది. పూజారి పెద్దయిపోతున్నారు. రాత్రిళ్ళు మా వంటామె చేసిన ఫలహారం భుజించి, నాకు వర్జ్యం, ముహూర్తాల ఆగమనాల గురించి చెప్పి వెళతారు. "హారతి ఇస్తుంటే చెయ్యివణుకుతోంది కదా స్వామీ, మీరింక విశ్రాంతి తీసుకోండంటే" వినరు.

"ఈ కట్టెలో జీవుడు ఉన్నంత వరకూ ఈ మాధవసేవ మానుకోలేను తల్లీ" అంటారు.

నిజమే. ఆయనది మాధవసేవ.

నాది మానవసేవ.

ఆయన మాధవునికీ, నేను మా ఊరి జనాలకూ మధ్య జన్మ జన్మల ఋణమేదో మిగిలి ఉంటుంది. అది తీర్చుకోటానికే ఇదిగో ఇలా దేవుని పూజారిగా ఆయనా - ఊరి జనుల పూజారిణిలా నేను.

మా ఊరి ప్రజలు మాత్రం మరోలా అనుకుంటారు.

ఊరికి ఉత్తరాన గుడిలో కదలని మా దేవుడు వేణుగోపాలస్వామి, ఉంటే - ఊరికి తూర్పున మేడలో కదిలే మా దేవత మహాలక్ష్మి తల్లి ఉంది అని.

Click here to share your comments on this story